క్లుప్తంగా

28న కంచమ్మతల్లి చల్లదన మహోత్సవం



సమావేశమైన దత్తత గ్రామాల ప్రజలు

కంచిలి: కంచిలి ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం కంచమ్మతల్లి చల్లదనం మహోత్సవం ఈ నెల 28న నిర్వహించాలని ఆలయ దత్తత గ్రామాల ప్రజలు నిర్ణయించారు. ఆ రోజున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, అమ్మవారి ప్రతిరూపాలైన గజముద్దలు, కాళికా వేషధారణ, డప్పు వాయిద్యాలతో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా ప్రశాంతంగా కార్యక్రమం నిర్వహించుకోవాలని కమిటీ సభ్యులు తీర్మానించారు.

మంత్రి ధర్మానను కలిసిన దువ్వాడ



మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గంలో పోలింగ్ సరళిని దువ్వాడ వివరించారు. టెక్కలి నియోజకవర్గంలో భారీగా విజయం సాధిస్తామని పేర్కొన్నారు. ఈయనతో పాటు పి.చంటి, బి.రాజు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ నర్తు పుట్టినరోజు వేడుకలు



పుట్టిన రోజు వేడుకల్లో రామారావు

కవిటి: మండలంలోని కొత్తపుట్టుగలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పుష్పగుచ్ఛాల్ని అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకుడు నర్తు శివాజీ యాదవ్ తండ్రి రామారావుకు కేక్ తినిపించారు.

జబ్బవాపు నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు, రామయ్యపేట గ్రామాల్లో 261 పశువులకు జబ్బవాపు నివారణకు ఉచితంగా టీకాలు వేసినట్లు కురుడు పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. పశువుల శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలు దాటితే 7680854777 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని 38 పంచాయతీల్లోనూ పశువులకు ఉచితంగా జబ్బవాపు నివారణకు టీకాలు వేస్తున్నట్లు డాక్టర్ తెలిపారు.

ఉత్సవాలకు నీటి సరఫరా



నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న ఇప్పిలి కృష్ణారావు

కంచిలి: మండలంలోని కేసరపడలో జరుగుతున్న గ్రామదేవత సింధుపోలమ్మ ఉత్సవాలకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం నీటి సరఫరా చేపట్టారు. వైఎస్సార్ సీపీ నేతలు ఇప్పిలి కృష్ణారావు, గుమ్మడి రామదాసు, నవీన్‌కుమార్ అగర్వాలా(బబ్లూ) ఆర్థిక సాయంతో ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపడుతున్నట్లు వారు తెలిపారు.

ఏపీఆర్‌డీసీలో ఉదిత్‌కుమార్‌కు పదో ర్యాంకు



ఉదిత్‌కుమార్

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం వడ్డివాడ గ్రామానికి చెందిన బాడాన ఉదిత్ కుమార్ ఇటీవల విడుదలైన ఏపీఆర్‌డీసీ(ఏపీ గురుకుల కళాశాల, డిగ్రీ) ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించాడు. ఉదిత్‌కుమార్ కోటబొమ్మాళిలోని ఆచార్య ఆదిత్యా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివాడు. తండ్రి అప్పన్న చిరుద్యోగి, తల్లి సరస్వతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉదిత్ కుమార్‌ను ఎంఈఓలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్, కళాశాల కరస్పాండెంట్ కె.బాలకృష్ణ, ప్రిన్సిపాల్ కె.చలపతిరావు, సిబ్బంది శుక్రవారం అభినందించారు.

• సందడే సందడి

ఇచ్ఛాపురం మండలం కమలాయిపుట్టుగ–లండపుట్టుగలో నిర్వహిస్తున్న అసిరిపోలమ్మ ఉత్సవాలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రత్యేకంగా తయారు చేసిన వెదురు జంగిడిని మహిళలు తలపై పెట్టుకొని మేళతాళాల మధ్య ఊరేగితున్నారు. బారువకు చెందిన రమేష్ కాళీమాత వేషధారణ, బొరివంక సన్నాయి మేళం, ఒడిశాకు చెందిన మహిళల గారడీ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.
– ఇచ్ఛాపురం రూరల్



ప్రత్యేక ఆకర్షణగా హరిశ్చంద్ర కాటిసీను నమూనా విగ్రహాలు



కర్రసాము చేస్తున్న ఒడిశా బాలికలు



కోలాటం ఆడుతున్న మహిళలు



అలరించిన వేషధారణలు

పకడ్బందీగా ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణ

కవిటి: చెత్తతో సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణ అన్ని గ్రామ పంచాయతీల్లో పటిష్టంగా నిర్వహించాలని డీపీఆర్‌సీ రిసోర్స్‌పర్సన్ పేరాడ ఆనందరావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ శివాజీ పాణిగ్రాహి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 పంచాయతీలకు గాను పది పంచాయతీల కార్యదర్శులే సమావేశానికి హాజరుకావడంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యక్రమాల నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు ఇదే రీతిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ ఆనందరావు

పంచాయతీల్లో వీధిదీపాల నిర్వహణ, చేతిపంపుల మరమ్మతులు, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు, మంచినీటి సరఫరాపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధనుంజయరెడ్డికి జాతీయ పురస్కారం

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి, ప్రముఖ జానపద కళాకారుడు తిప్పన ధనుంజయరెడ్డి తెలుగు వెలుగు సాహితీ వేదిక అందించే తెలుగు వెలుగు ఉగాది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం సంస్థ కార్యసంచాలకులు పోలోజ్ రాజ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. పాతికేళ్లుగా శాస్త్రీయ సంగీతం, జానపద పండరీ భజన, కోలాటం వంటి రంగాల్లో సేవలందిస్తున్న ధనుంజయరెడ్డికి ఈ నెల 19న ప్రకాశం జిల్లాలో నిర్వహించే కార్యక్రమం పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, రంగాల జానీరెడ్డి, ఇచ్ఛాపురం నియోజకవర్గం సాంస్కృతిక కళాకారుల సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



తిప్పన ధనుంజయరెడ్డి

మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇటీవల కాలంలో అనారోగ్యం కారణంగా మృతిచెందారు. ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు శుక్రవారం పరామర్శించారు. మఠంసరియాపల్లి పంచాయతీ నారాయణబట్టి గ్రామానికి చెందిన కిలుగు దుర్యోధన(80), కొత్తంపురం గ్రామానికి చెందిన మద్ది అప్పారావు(45), కవిటి మండలం జి.బెలగాం గ్రామానికి చెందిన మద్దిలి ఈశ్వరరావు తండ్రి మునలయ్య(76)ల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుద్దెపు విశ్వనాథం, దుర్గాసి ధర్మారావు, తలగాన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ నేతలు

రామానుజుల కృషి ప్రశంసనీయం

శ్రీకాకుళం కల్చరల్: మానవుల ఉన్నతికి భగవద్రామానుజాచార్యులు విశేష కృషి చేశారని ప్రముఖ వక్త భాష్యం పద్మనాభాచార్యులు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో మహానుభావుల జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రసంగించారు. విశిష్టాద్వైత మూలపురుషుడైన రామానుజాచార్యులు ఆధ్యాత్మికంగా, సాంఘికంగా విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మణికొండ రామారావు, ఎస్.నారాయణమూర్తి, పప్పు పతంజలి శాస్త్రి, పి.అప్పలకొండ, ఎం.శ్రీనివాసరావు, బాబూరావు, ఈశ్వరరావు, సంగమేశ్వరరావు పాల్గొన్నారు.



పద్మనాభాచార్యులును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

మోహనరావుకు తెలుగు వెలుగు పురస్కారం



జీరు మోహనరావు

నందిగాం: తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు–2024లో భాగంగా జాతీయ పురస్కారానికి నందిగాం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన జీరు మోహనరావు ఎంపికయ్యారు. ఈయన పాతికేళ్లుగా రంగస్థల, పౌరాణిక, భజన కళారంగంలో అందించిన సేవలను గుర్తించి తెలుగు వెలుగు జ్ఞానబుద్ధ పూర్ణ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19న ప్రకాశం జిల్లాలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకుంటారు. మోహనరావును కళాకారులు, భజన బృంద సభ్యులు అభినందించారు.

పలాస ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

కాశీబుగ్గ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్‌లలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పలాసలోని డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తుకొనేటప్పుడు రిజిస్ట్రేషన్ ఐడీ స్లిప్పుతో పాటు ఒరిజనల్ ధ్రువపత్రాలు, ఆధార్‌తో సమీప ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. పలాస ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ మెకానిక్, డీఎం సివిల్, మెకానికల్ డీజిల్, వెల్డర్, కోపా ట్రేడ్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాశీబుగ్గ: విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 19న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ శ్రీనివాస్‌నగర్, రోటరీ నగర్, నెహ్రూనగర్, నిత్యానందనగర్, ఎంపీడీఓ ఆఫీస్ రోడ్డు, పండా క్వార్టర్స్, పద్మనాభపురం, పాత ఎన్‌హెచ్–5 రోడ్డు, పూజారివీధి, జెడ్పీహెచ్ స్కూల్ రోడ్డు, సంతమార్కెట్, వెంకటేశ్వర కాలని, రైల్వే స్టేషన్, పెంటతోటవీధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు చిట్టి జానకమ్మకు పూండికి చెందిన యువతరం సేవా సమితి రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి ఆదుకుంది. శుక్రవారం ఉద్దానం రామకృష్ణాపురం వెళ్లిన సేవా సమితి ప్రతినిధులు జానకమ్మ పేదరికంతో మగ్గుతుండడం చూసి చలించిపోయారు. భర్త చనిపోవడం, బ్రెయిన్ క్యాన్సర్, కిడ్నీ వ్యాధి బారిన పడిన ఆమెకు నెలకు దాదాపు రూ.8వేలు వరకు మందుల కోసం ఖర్చు అవుతున్నాయి. విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి ఆదుకుంది. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళీ, ప్రతినిధులు జి.సునీల్, బత్తిని విఘ్నేష్, జి.వెంకటరమణ, గాడి అఖిల్, బి.లక్ష్మణ్, మణి, వెంకటేష్, మాధవరావు, భాస్కర్, ప్రమీల, దీపిక పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో పోషకాలు



పాయితారి రైతులకు కిట్లు అందిస్తున్న యూనిట్ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ఎరువులు, పురుగు మందుల వినియోగం లేకుండా జీరో కాస్ట్, ప్రకృతి విధానంలో సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పాయితారి గ్రామంలో 50 మంది రైతులకు నవ ధాన్యాల కిట్లు అందజేశారు. ప్రకృతి విధానం సాగులో పంట వారం రోజుల్లో కోతకు వచ్చేలా 33 రకాల నవ ధాన్యాలను రూపొందించినట్లు తెలిపారు. వారం రోజుల్లో మొలకొచ్చే నవ ధాన్యాల విత్తనాలు 35 నుంచి 40 రోజుల్లో పూర్తి స్థాయిలో ఎదుగుతాయని వివరించారు. కార్యక్రమంలో యూనిట్ సిబ్బంది తలసయ్య, ఐసీఆర్‌పీఎస్ స్వాతి, సంతోషి, నాగమణి, కుమారి పాల్గొన్నారు.

నడవడిక మార్చుకోండి



మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : తెలిసో తెలియక చేసిన తప్పుల కారణంగా సమాజంలో రౌడీషీటర్లుగా ముద్రపడే మీలాంటి వారంతా నడవడిక మార్చుకుంటే రౌడీ షీట్లు ఎత్తివేస్తామని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఎస్పీ రాధిక ఆదేశాలతో శుక్రవారం రాత్రి స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉన్న మాదిరిగానే మిగతా సమయంలోనూ ప్రశాంతంగా కుటుంబంతో గడపాలన్నారు. కొట్లాటకు, దొమ్మీలకు వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పీడీ యాక్టులు నమోదు చేసి జిల్లా బహిష్కరణకు గురి చేస్తామన్నారు. సీఐతో పాటు ఎస్ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా క్షీరాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న నారాయణ తిరుమల వేంకటేశ్వర ఆలయంలో కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి నిజరూపాన్ని కనులారా వీక్షించి తన్మయత్వం పొందారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది.



రాయితీపై విత్తనాలు

గార: మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ముందస్తుగా వేసే కట్టె జనుము, జీలుగు విత్తనాలు 50 శాతం రాయితీపై అన్ని రైతు భరోసా కేంద్రాల్లో లభ్యమవుతున్నాయని గార మండల వ్యవసాయాధికారి దుంపల పద్మావతి తెలిపారు. కట్టె జనుము 30 క్వింటాళ్లు, జీలుగు 70 క్వింటాళ్లు విత్తనాలు మంజూరయ్యాయని చెప్పారు.

పాడిని కాపాడుకుందాం ఇలా..

- వేసవిలో పాడిపశువుల సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు
- పశువైద్యాధికారి రమణ



రమణ

ఎచ్చెర్ల:

పాడిపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. గేదెలు, ఆవులకు ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగినా తక్షణమే వైద్య సాయం అవసరమైతే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే క్షణాల్లో పశువైద్యులు అంబులెన్స్ ద్వారా అక్కడికి చేరుకుని పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో పాడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పశువులను కాపాడుకోవచ్చని ఎచ్చెర్ల మండల పశు వైద్యాధికారి డాక్టర్ వి.రమణ సూచించారు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాడి రైతులకు ఆయన అందించిన సూచనలు ఇలా..

పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి. పరిశుభ్రమైన చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. పచ్చని, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి. గేదెల పాకలు చల్లగా ఉండేలా జాగ్రత్త పడ్డాలి. పశువుల పాక పైకప్పును గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి.

వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేపచెట్లు పెంచుకోవాలి. రోజుకు రెండు మూడు సార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం పది గంటలలోపు సాయింత్రం ఐదు గంటలపైన మాత్రమే మేత కోసం పశువులను బయటకు తోలాలి. ఎండ ఉన్న సమయంలో మేతకు బయటకు తోలకూడదు.



మేత మేస్తున్న పశువులు

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చమటలు ఎక్కువగా బయటకు రావటం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయక పోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగా రాక పోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స: వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సైలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులను విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూదిమందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.



పాకలో కట్టిన పశువులు

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.